

రాష్ట్రంలో ద్రావిడ సిద్ధాంతాలు తెలియని ఎడప్పాడి పళనిస్వామి ప్రతిపక్ష నేతగా ఉన్నారని, అన్నాదురై సిద్ధాంతాలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాదాల ముందు తాకట్టు పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని, డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. కరూర్ జిల్లా కోడాంగిపట్టి వద్ద నిర్వహించిన 'ముప్పెరుం విళా' సభలో ఆయన ప్రసంగించారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి



అమిత్‌షా పాదాల వద్ద అన్నా సిద్ధాంతాలు

● ద్రావిడ సిద్ధాంతాలు తెలియని ప్రతిపక్షనేత పళనిస్వామి ● కరూర్ సభలో ఈపీఎస్‌పై స్టాలిన్ ధ్వజం

కరూర్ జిల్లా కోడాంగిపట్టి వద్ద అన్నాదురై జయంతి, పెరియార్ జయంతి, డీఎంకే వ్యవస్థాపక దినం పేరిట మూడు వేడుకలు కలిపి 'ముప్పెరుం విళా' నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ డీఎంకేకు ప్రత్యామ్నాయ పార్టీ తమదేనంటూ గొప్పలు చెప్పుకున్నవారంతా కాలగర్భంలో కలిసిపోయారని, తమిళుల గౌరవాన్ని, రాష్ట్ర గౌరవాన్ని ఇతరుల వద్ద తాకట్టుపెట్టే ప్రసక్తే లేదని, తమిళులంతా ఎల్లప్పుడూ ఆత్మగౌరవంతోనే బ్రతకాలని కోరుకుంటారే తప్ప బానిస బతుకులకు కోరుకోరని స్పష్టం చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో డీఎంకే ఎంపీ కనిమొళికి పెరియార్ అవార్డు, శుభ సీతారామన్‌కు అన్నా అవార్డు, ఎస్ఎం రామచంద్రన్‌కు కలైంజర్ అవార్డు, స్వర్గీయ కుళిత్తలై సీతారామన్‌కు పావేందర్ అవార్డు, మరుదూరు రామలింగంకు పేరాసియర్ అవార్డు, పొంగలూరు ఎన్.పళనిస్వామికి ఎంకే స్టాలిన్ అవార్డు, సీనియర్ జర్నలిస్టు ఏఎస్ పన్నీర్ సెల్వంకు 'మురసొలి సెల్వం' అవార్డును స్టాలిన్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో గాలివాటున అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టి, ప్రస్తుతం ప్రతిపక్షనేతగా ఉన్న ఈపీఎస్‌కు ద్రావిడ సిద్ధాంతాలేవీ తెలియవన్నారు. ఢిల్లీలో అమిత్‌షాతో భేటీ అయి కారులో వెళుతూ ముఖానికి ఖర్చీఫ్ అడ్డుగా పెట్టుకుని ఈపీఎస్ వెళ్ళడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కాషాయ సిద్ధాంతాల వల్లే సమస్యలు...

కాషాయ సిద్ధాంతాల వల్ల రాష్ట్రంలో సమస్యలు ఎదురవుతున్నాయని, ఆ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా డీఎంకే పోరాటం చేస్తునే ఉందని స్టాలిన్ అన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా రాష్ట్రాధికారాన్ని చేపట్టిన ప్రాంతీయ పార్టీ డీఎంకే అని, రాష్ట్రాలపై కేంద్రం పెత్తనాన్ని సహించలేకపోతున్నామని, కేంద్రంలోని బీజేపీ పాలకులకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా పోరాటం చేస్తున్న పార్టీ కూడా తమదేనని స్టాలిన్ పేర్కొన్నారు. బీజేపీ పెద్దలు ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో ఆ పార్టీకి స్థానం లేదని స్పష్టం చేశారు. పెరియార్, అన్నాదురై, కరుణానిధి సిద్ధాంతాలకు అనుగుణంగా వారిని ఆదర్శంగా తీసుకుని ఆ ముగ్గురు నేతల అడుగుజాడల్లోనే నడుస్తున్నామని, వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి అధికారంలోకి రావటం ఖాయమని సగర్వంగా ప్రకటిస్తున్నానన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రి సెంథిల్‌బాలాజీ స్వాగతోపన్యాసం చేశారు. డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, ముఖ్య కార్యదర్శి కేఎన్ నెహ్రూ, మంత్రి ఐ పెరియసామి, ఎంపీలు తిరుచ్చి శివ, ఎ. రాజా, అందియూరు సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు గొడుగులు

● ఊరేగింపును ప్రారంభించిన గవర్నర్ ● ఉత్తర చెన్నైలో మార్మోగిన గోవింద నామస్మరణ



తిరుపతి గొడుగుల ఊరేగింపును ప్రారంభిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల కోసం చెన్నై నుంచి గొడుగులు బయలుదేరాయి. 'తిరుక్కుడై సేవా సమితి ట్రస్టు', 'విశ్వ హిందూపరిషత్' సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఫ్లవర్ బజార్ నుంచి గొడుగులు తిరుమలకు కదిలాయి. ఈ ఊరేగింపును రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఊరేగింపులో చిన్మయా మిషన్ స్వామి మిత్రానంద మహరాజ్, విశ్వహిందూ పరిషత్ ఉత్తర తమిళనాడు అధ్యక్షుడు అండాల్ చొక్కలింగం, విశ్వహిందూ పరిషత్ అఖిల భారత న్యాయవాదుల సంఘం ప్రతినిధి ఎస్.శ్రీనివాసన్, తిరుక్కుడై సేవా సమితి ట్రస్టు నిర్వాహక ట్రస్టీ జి.రామలింగం, ఎ.తనిగైవేల్, బద్రినారాయణ, రమేష్‌కుమార్ చోప్రా, ఆర్.కార్తికేయన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, సినీనటుడు రంజిత్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మొత్తం 21 గొడుగులతో చెన్న కేశవపెరుమాళ్ ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య కదిలిన ఈ ఊరేగింపు ఎన్ఎస్సీ బోస్ రోడ్డు, వాల్‌టాక్స్ రోడ్డు, చూళై హైరోడ్డు, అవధాన పాపయ్య రోడ్డు, వడమలైపిళ్లై వీధి, చెల్లప్ప వీధి, కున్నూరు హైరోడ్డు, అయనావరం అంబత్తూరు, ఆవడి, తిరువళ్లూరు, పుత్తూరు మీదుగా ఈ నెల 21, ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుమల చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. అక్కడ రాష్ట్ర భక్తుల తరఫున టీటీడీ అధికారులకు పవిత్ర గొడుగులను అప్పగించనున్నట్లు జి.రామలింగం మీడియాకు తెలిపారు.

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా
సెంథిల్ కుమార్, అరుళ మురుగన్



జస్టిస్ అరుళ్‌మురుగన్, జస్టిస్ సెంథిల్‌కుమార్

● కొలీజియం సిఫారసు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జస్టిస్ సెంథిల్ కుమార్, జస్టిస్ అరుళ్ మురుగన్‌లకు శాశ్వత న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దానిని పరిశీలించిన కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర లభించగానే వారిద్దరూ శాశ్వత న్యాయమూర్తులుగా పదోన్నతి పొందనున్నారు. జస్టిస్ ఎన్.సెంథిల్‌కుమార్ 1970లో జన్మించారు. చెన్నై రైల్వే పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం ముగించి, సేలం కేంద్ర న్యాయకళాశాలలో లా కోర్సు పూర్తిచేశారు. 1994లో న్యాయవాదిగా నమోదు చేసుకుని, సీనియర్ న్యాయవాది ఆర్.షణ్ముగసుందరం వద్ద జూనియర్‌గా పని చేశారు. క్రిమినల్ కేసుల్లో విశిష్టంగా రాణించిన ఆయన.. 2007 నుంచి 2009 వరకు రాష్ట్ర ప్రభుత్వ అదనపు న్యాయవాదిగాను, అనంతరం కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2023 అక్టోబరు 16వ తేది మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అలాగే, జస్టిస్ జి.అరుళ్ మురుగన్, 1976 మే 27న ధర్మపురి జిల్లా అరూర్‌లో జన్మించారు. సేలం హోలీక్రాస్ పాఠశాలలో ప్రాథమిక విద్య, సేలం కేంద్ర న్యాయ విశ్వవిద్యాలయంలో లా కోర్సు పూర్తిచేసి, 1999లో న్యాయవాదిగా నమోదుచేసుకున్నారు. సీనియర్ న్యాయవాది కె.దురైస్వామి వద్ద జూనియర్‌గా 2002 వరకు పనిచేశారు. ఆయన సివిల్, క్రిమినల్ కేసుల్లో హాజరై వాదించేవారు. గత ఏడాది మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

అధికారంలో భాగస్వామ్యం కావాలని రాహుల్ కోరలేదు

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై



పెరియార్ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి నివాళులర్పిస్తున్న సెల్వ పెరుంతగై

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార భాగస్వామ్యం పొందాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎప్పుడూ చెప్పలేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు. బుధవారం పెరియార్ జయంతి సందర్భంగా నగరంలోని సిమ్సన్ జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలనే కోరుకుంటోందని, ప్రతి ఎన్నికల్లోనూ సీట్లు పెంచాలని మాత్రమే కూటమికి నేతృత్వం వహిస్తున్న డీఎంకేను డిమాండ్ చేస్తోందన్నారు. అదే సమయంలో అధికారంలో భాగస్వామం కావాలని కాంగ్రెస్ నాయకులెవరూ కోరలేదని స్పష్టం చేశారు. జయలలిత మృతి తర్వాత అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కాపాడిందంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చెప్పడం చూస్తుంటే అన్నాడీఎంకే నేతలంతా బీజేపీకి బానిసలుగా వ్యవహరించారని స్పష్టమవుతోందని సెల్వపెరుంతగై ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ నేతలు ఎస్.తిరునావుక్కరసర్, కేవీ తంగబాలు తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్, శశికళకు నో ఎంట్రీ

● అమిత్‌షాకు తేల్చి చెప్పిన ఈపీఎస్

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ నుంచి బహిష్కృతులైన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), వీకే శశికళను మళ్ళీ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి ఢిల్లీలో ఎంపీ సీవీ షణ్ముగం, కేపీ మునుసామి, దిండుగల్ శ్రీనివాసన్, ఎస్పీ వేలుమణి, తంబిదురై, ఇన్బదురై, ధనపాల్ తదితరులతో కలిసి అమిత్‌షాను ఆయన నివాసంలో ఈపీఎస్ కలుసుకున్నారు. సుమారు 45 నిమిషాలకు పైగా పైగా ఇద్దరూ చర్చించుకున్నారు. ముందుగా అమిత్‌షాకు పుష్పగుచ్ఛం, శాలువతో సత్కరించారు. ఆ తర్వాత ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తురామలింగ్ దేవర్‌కు 'భారతరత్న' ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈపీఎస్ ప్రచారం గురించి, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు గురించి అమిత్‌షా అడిగి తెసుకున్నారు. ఆ తరువాత ఈపీఎస్, అమిత్‌షా ఏకాంతంగా భేటీ అయినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమిని బలపరిచే దిశగా కొత్త పార్టీలను చేర్చుకునే విషయమై ఆ నేతలు చర్చించుకున్నారు. అంతేగాక టీటీవీ దినకరన్, ఓపీఎస్, శశికళను అన్నాడీఎంకేలో మళ్ళీ చేర్చుకునే విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితుల్లో ఆ ముగ్గురిని చేర్చుకునే ప్రసక్తేలేదని, పార్టీకి ద్రోహం చేసిన వారిని మళ్ళీ చేర్చుకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయని ఈపీఎస్ స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే వారిని ఎన్డీయే కటమిలో చేర్చుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదన్నట్లు సమాచారం. చివరకు అమిత్‌షా ఈపీఎస్ వాదనతో ఏకీభవించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.



అమిత్‌షాతో ఈపీఎస్

ప్రధాని మోదీకి నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం గవర్నర్, సీఎం, ప్రతిపక్ష నేత, సినీనటులు తదితరులు ఫోన్ ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ ఆర్ఎన్ రవి రాజ్‌భవన్ నుంచి విడుదల చేసిన ప్రకటనలో ప్రపంచంలో శాంతి నెలకొనాలని, భారత్‌ను అగ్రదేశాల సరసన చేర్చాలని అలుపెరుగక కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం తప్పక నెరవేరుతుందని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో వందేళ్లు జీవించాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ మంచి ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో విరసిల్లాలని కాంక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో పోస్ట్ చేశారు.అన్నాడీఎంకే ప్రధాన కార్యద్శ ఎడప్పాడి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీఅధ్యక్షుడు అన్నామలై, పీఎంకే నేత అన్బుమణి, న్యూజస్టిస్ పార్టీ షణ్ముగం, సూపర్‌స్టార్ రజినికాంత్, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా తదితరులు మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

పెరియార్‌కు నేతల ఘననివాళి



పెరియార్‌కు రాష్ట్రప్రభుత్వం తరుపున సమాచారశాఖ అధికారులతో కలిసి నివాళులర్పిస్తున్న మంత్రి శేఖర్‌బాబు



తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్‌లోని పెరియార్ విగ్రహం, చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, ఎంపీలు

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ ఉద్యమనేత తంద్రై పెరియార్ 147వ జయంతిని పురస్కరించుకొని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అన్నాసాలై సింసన్ జంక్షన్‌లో ఉన్న పెరియార్ విగ్రహానికి రాష్ట్రప్రభుత్వం తరుపున హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు, సమాచారశాఖ కార్యదర్శి వి.రాజారామన్, డైరెక్టర్ ఆర్.వైద్యనాథన్, ప్రభుత్వ ఉన్నతాధికారులతో నివాళులర్పించారు. కరూర్ వెళ్తూ మార్గమధ్యలో తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్ వద్దనున్న పెరియార్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన పెరియార్ చిత్రపటానికి ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళులర్పించారు. అదేవిధంగా సీనియర్ మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్, రఘుపతి, ఎంపీలు టీఆర్ బాలు, కనిమొళి, తిరుచ్చి శివ తదితరులు నివాళులర్పించారు. అనంతరం కరూర్‌లో ఉన్న పెరియార్ విగ్రహానికి డిప్యూటీ సీఎం ఉదయనిధి నివాళులర్పించారు. అలాగే జెమిని ఫ్లైఓవర్ వద్దనున్న పెరియార్ విగ్రహం వద్ద అన్నాడీఎంకే తరుపున ప్రిసీడియం చైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు డి.జయకుమార్, పి.బెంజ్‌మెన్, వలర్మతి, మాజీ ఎంపీ బాలగంగా, పలు విభాగాల నాయకులు పెరియార్ చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు. అనంతరం ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, మాజీమంత్రి సెంథమిళన్, సినీనటి సరస్వతి, మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, వీకే.శశికళ, కొళత్తూరు కృష్ణమూర్తి, ఎగ్మూర్‌లోని తాయగంలో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తదితరులు నివాళులర్పించారు.



పెరియార్ విగ్రహం ముందు ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే నేతలు తమిళ్‌మగన్‌హుసేన్, డి.జయకుమార్ తదితరులు

సమాచార దృశ్యిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పాడి-కొరట్టూరు పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. పాడి, ఎంటీహెచ్ రోడ్డు, అన్నై నగర్, టీఎన్‌హెచ్‌బీ కొరటూరు, పార్క్ రోడ్డు, టీచర్స్ కాలని, పుత్తాగరం, దాదన్‌కుప్పం, సెంథిల్ నగర్, టీవీఎస్ నగర్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు వేలు నాచియార్ విగ్రహావిష్కరణ

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వేలు నాచియార్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ గిండిలోని గాంధీ మండపంలో ఆవిష్కరించనున్నారు. గిండి గాంధీ మండప ప్రాంగణంలో రూ.50 లక్షలతో స్వాతంత్ర్య సమరయోధుడు వేలు నాచియార్ విగ్రహం ఏర్పాటుచేయనున్నట్లు శాసనసభలో ప్రకటించారు. ఈ మేరకు విగ్రహం ఏర్పాటుపనులు పూర్తికావడంతో, ఈ నెల 19వ తేది జరిగే కార్యక్రమంలో సీఎం స్టాలిన్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు తరమణిలో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణి సీఎస్ఐఆర్ రోడ్డు సమీపంలోని టైడల్ పార్క్ ఉప విద్యుత్ కేంద్రంలో గురువారం గ్రీవెన్స్ జరునుంది. ఈ కేంద్రంలోని ఐటీ కారిడార్ నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో, తరమణి, పెరుంగుడి, పరిసర ప్రాంతాలకు చెందిన వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

8వ తరగతి పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అభ్యర్థుల ఎనిమిదవ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు పరీక్షల శాఖ డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ప్రైవేటు అభ్యర్థులకు 8వ తరగతి పబ్లిక్ పరీక్షలు గత నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించామన్నారు.ఆఫలితాలు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశామని, అభ్యర్థులు తమ రిజిస్టర్ నెంబరు, పుట్టన తేది నమోదుచేసి మార్కులు తెలుసుకోవచ్చని పరీక్ష శాఖ తెలిపింది.

నేటినుంచి వైగై డ్యాం నీరు విడుదల

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైగై డ్యాం నుంచి 120 రోజుల పాటు సాగు నీరు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... ముల్లైపెరియార్ ఆయకట్టు భూములకు గురువారం నుంచి రోజుకు 1,130 ఘనపుటడుగుల చొప్పున 120 రోజుల పాటు నీరు విడుదల చేయనున్నట్లు పేర్కొంది. తద్వారా మదురై, శివగంగ, దిండుగల్ జిల్లాలోని 1,05,002 ఎకరాలకు సాగు నీరందుతుందని ప్రభుత్వం తెలిపింది.

దూరవిద్య కోర్సుల అడ్మిషన్ గడువు పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జాతీయ దూరవిద్య విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై సెమిస్టర్‌కు సంబంధించి అడ్మిషన్ల ఈ నెల 30వ తేది వరకు పొడిగించారు. ఈ మేరకు ఇగ్నో చెన్నై మండల డైరెక్టర్ పన్నీర్‌సెల్వం విడుదల చేసిన ప్రకటనలో... తమ విశ్వవిద్యాలయం యూజీ, పీజీ, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులు అందిస్తుందన్నారు. 2025 జూలై సెమిస్టర్‌కు విద్యార్థుల అడ్మిషన్ల గడువు ముగిసిన నేపథ్యంలో, విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 30వ తేది వరకు పొడిగించామన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు https://ignouadmission.samarth. edu.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని, మరిన్ని వివరాలకు www.ignou.ac.in అనే వెబ్‌సైట్, 044-26618040 అనే నెంబరు సంప్రదించాలని ఇగ్నో డైరెక్టర్ తెలిపారు.

పర్యాటక శాఖ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ పురస్కారాలకు ఈ నెల 30వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పర్యాటక శాఖ అభివృద్ధికి తోడ్పడుతున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ప్రతి ఏటా అంతర్జాతీయ పర్యాటక దినోత్సవమైన సెప్టెంబరు 27న పురస్కారాలు ఇస్తుంటారు. ఉత్తమ టూర్ ఆపరేటర్, టూర్ గైడ్, హోటల్, రెస్టారెంట్ సహా 15 విభాగాల్లో పురస్కారాలు అందజేయనున్నారు. ఈ ఏడాది పురస్కారాలకు దరఖాస్తులకు ఈ నెల 15వ తేదిలోగా సమర్పించాలని ఇదివరకు ప్రకటించగా, తాజాగా దరఖాస్తు స్వీకరణ ఈ నెల 30వ తేది వరకు పొడిగించారు. ఆసక్తి కలిగిన వారు www. tntourismawards.com అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 9176995869 అనే నెంబరు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో గురువారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. 2 మండలం 18వ వార్డు మనలి ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలోని ఎస్ఆర్ఎఫ్ విద్యాలయ మైదానం, 4వ మండలం 36వ వార్డు ఎతిరాజ్ సామి రోడ్డు సమీపంలోని డాన్‌బాస్కో హైయర్ సెకండరీ స్కూలు, 5వ మండలం 61వ వార్డు ఎగ్మూర్ వానెన్నల్స్ రోడ్డు సమీపంలోని సిరాజ్ మహల్, 7వ మండలం 81వ వార్డు అంబత్తూర్‌లో ఎస్ఎంకే కల్యాణ మండపం, 8వ మండలం 97వ వార్డు అయనావరంలో చెన్నై ప్రైమరీ స్కూలు మైదానం, 9వ మండలం 114వ వార్డు చేపాక్కం సీఎన్‌కే రోడ్డు సమీపంలోని మైదానం, 10వ మండలం 139వ వార్డు జాఫర్‌ఖాన్ పేట ఆర్ఆర్ కాలనీ 2వ లింక్ వీధి సమీపంలోని ప్లై ఫీల్డ్‌లో శిబిరాలు జరుగునున్నాయి. అలాగే, 12వ మండలం 165వ వార్డు వానువంపేటలోని పాలాం డిమ్మన్ కల్యాణ మండపం, 15వ మండలం 195వ వార్డు తొరైపాక్కంలోని ఎలిమ్ మెట్రిక్యులేషన్ స్కూలులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

రోగివేషంలో ఆస్పత్రికి..

- గోల్కానత్తం పీహెచ్‌సీలో కలెక్టర్
- ఆరోగ్యం బాగా లేదనగానే ఇంజక్షన్ చేసేందుకు సిద్ధమైన నర్సు

పెరంబూర్, సెప్టెంబరు 17: పెరంబలూరు జిల్లా గోల్కానత్తం ప్రాథమిక కేంద్రానికి సాధారణ రోగి వేషంలో వెళ్లిన జిల్లా కలెక్టర్ మృణాళిని అక్కడ ప్రజలకు ఏవిధంగా వైద్యం అందుతుందో పరిశీలించారు. ఇటీవల గోల్కానత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కు.ని శస్త్రచికిత్స చేయించుకున్న ఓ మహిళ.. ఆస్పత్రిలో చికిత్స సరిగ్గా లేదంటూ జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. దీంతో, ఘటన జరిగిన రోజు సాయంత్రం.. సాధారణ రోగి వేషంలో కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. తనకు ఆరోగ్యం సరిగా లేదని ఆస్పత్రిలో ఉన్న నర్సుకు చెప్పగా, నర్సు ఎలాంటి పరీక్ష చేయకుండానే ఇంజక్షన్ వేసేందుకు సిద్ధమైంది. దాంతో అప్రమత్తమైన కలెక్టర్ ఇక్కడ డాక్టర్లు ఎవరూ లేరా?.. వారు రోగులను చూడరా అంటూ ప్రశ్నించారు. అప్పటికి ఆమెను కలెక్టర్‌గా గ్రహించిన నర్సు వణికిపోయింది. ఆ కేకలు విని ఆస్పత్రి సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు. డాక్టర్ గురించి ఆరా తీయగా అందరూ నీళ్లు నమిలారే తప్ప ఒక్కరు కూడా సమాధానం చెప్పలేకపోయారు. దీంతో రిజిస్టర్ పరిశీలించిన కలెక్టర్ దానిని సక్రమంగా నిర్వహించడం లేదని తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నర్సుపైనా, విధులకు గైర్హాజరైన వైద్యుడిపైనా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ మృణాళిని

ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది.

కుంభకరై జలపాతంలో స్నానాలకు నిషేధం

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కుంభకరై జలపాతం వద్ద నీటి ఉధృతి కారణంగా స్నానాలపై నిషేధం విధించారు. కుంభకరై జలపాతం సందర్శించేందుకు పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. ఈ క్రమంలో, జలపాతం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా బుధవారం ఉదయం జలపాతం వద్ద నీటి ఉధృతి పెరగడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతం వద్ద స్నానాలకు నిషేధం విధిస్తున్నట్లు అటవీ శాఖ ప్రకటించింది.

పాలిటెక్నిక్ పరీక్ష ఫీజు గడువు పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యార్థులు జరిమానా లేకుండా పరీక్షా ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగించారు. ఈ మేరకు సాంకేతిక విద్య కమిషనర్ ఇన్నసెంట్ దివ్య విడుదల చేసిన ప్రకటనలో... పాలిటెక్నిక్ కళాశాలల్లో 3వ సంవత్సరం విద్యార్థులకు నవంబరులో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్షా ఫీజు గడువు ఈ నెల 16తో ముగిసింది. అలాగే, జరిమానా రూ.150 చెల్లించి బుధవారం నుంచి 23వ తేది వరకు, రూ.750 జరినామాతో ఈ నెల 24 నుంచి 26వ తేది పరీక్షా ఫీజు చెల్లించాలని ఇదివరకు ప్రకటించారు. కానీ, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు, జరిమానా లేకుండా పరీక్షా ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 20వ తేది వరకు పొడిగించామన్నారు. అలాగే, రూ.150 జరిమానాతో ఈ నెల 21 నుంచి 27వ తేది, రూ.750 జరిమానాతో ఈ నెల 28 నుంచి అక్టోబరు 6వ తేదీలోగా చెల్లించాలని, సెమిస్టర్ విద్యార్థులకు చివరి తరగతులు అక్టోబరు 3తో ముగుస్తాయని ప్రకటించిన నేపథ్యంలో, అక్టోబరు 17వ తేది వరకు తరగతులు నిర్వహించనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

బెంగళూరు విమానంలో సాంకేతికలోపం

- చెన్నైలో మళ్లీ అత్యవసర ల్యాండింగ్

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి మంగళవారం అర్ధరాత్రి బెంగళూరు బయల్దేరిన విమానం మార్గమధ్యలో సాంకేతికలోపానికి గురవడంతో మళ్లీ చెన్నైలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. చెన్నై నుంచి ఐదుగురు సిబ్బంది సహా 160 మంది ప్రయాణికులతో ఇండిగో విమానం బెంగళూరు బయల్దేరింది. విమానం కాంచీపురం దాటి వేలూరు సమీపంలోకి వెళ్తున్న సమయంలో, హఠాత్తుగా విమానంలో సాంకేతిక లోపాన్ని పైలెట్ గమనించి వెంటనే చెన్నై విమానాశ్రయ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. అధికారుల సూచనల మేరకు విమానాన్ని మళ్లీ చెన్నై మళ్లించి సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. విమానంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిచేసేందుకు నిపుణులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ కారణంగా, ప్రయాణికులను వేరే విమానంలో పంపినట్లు అధికారులు తెలిపారు.

శ్రీలంక నుంచి నగరానికి చేరుకున్న జాలర్లు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన రాష్ట్ర జాలర్లు మంగళవారం నగరానికి చేరుకున్నారు. రామనాథపురం జిల్లా రామేశ్వరానికి చెందిన జాలర్లు జూన్ 28, 30వ తేదీల్లో రెండు ఫైబర్ పడవల్లో చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన శ్రీలంక నావికా దళం, సరిహద్దులు దాటారనే కారణంగా వారిని అరెస్ట్ చేసింది. అలాగే, జూలై 27వ తేది చేపల వేటకు వెళ్లిన 9 మంది రామేశ్వరం జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో, శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లకు ఆ దేశ న్యాయస్థానం శ్రీలంక కరెన్సీలో తలా రూ.5 లక్షల జరిమానా విధించింది. వీరిలో ఏడుగురు తమకు విధించిన జరిమానాను ఆగస్టు 14వ తేది చెల్లించడంతో వారిని విడుదల చేశారు. అలాగే, శ్రీలంక న్యాయస్థానం మరో 13 మంది జాలర్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో, 20 మంది జాలర్లు మంగళవారం కొలంబో నుంచి విమానంలో నగరానికి చేరుకున్నారు. జాలర్లను మత్స్యశాఖ అధికారులు కలుసుకుని, వారి వారి స్వగ్రామాలకు వెళ్లేలా వాహనాలు ఏర్పాటుచేసి పంపించారు.

నా సభలకు కూడా భారీగా జనం

- బీజేపీ నేత శరత్‌కుమార్

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తన సభలకు కూడా జనం భారీగా హాజరయ్యేవారని బీజేపీ నేత శరత్ కుమార్ వ్యాఖ్యానించారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ చేపట్టిన ప్రచారానికి లక్షలాది మంది తరలిరావడంపై పలు పార్టీల నేతలు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు.ఈ వ్యవహారంపై శరత్‌కుమార్ స్పందిస్తూ... 1996లో 'నాట్టామై', 'సూర్యవంశం' తదితర విజయవంతమైన చిత్రాల అనంతరం తాను రాజకీయాల్లోకి వచ్చానని, పదవీవిరమణ అనంతరం రాజకీయాల్లోకి రాలేదన్నారు. మదురైలో తాను నిర్వహించిన సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని, అప్పటి వీడియో దృశ్యాలు కావాలంటే పరిశీలించవచ్చన్నారు. ఏ పార్టీ సభకైనా ప్రజలు పెద్దసంఖ్యలో వస్తారని, విజయ్‌కు సిద్ధాంతం, లక్ష్యం లేవని, ప్రతిపక్ష రాజకీయాలు మాత్రమే చేస్తున్నారని శరత్‌కుమార్ విమర్శించారు.

వడపళని సిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని సిమ్స్ హాస్పిటల్‌లో కాలిలో అసాధారణమైన ఎముక పెరుగుదల, దాని ప్రభావంతో ధమని వాపు, అపసవ్య రక్త ప్రసరణతో బాధపడుతున్న 48 యేళ్ల వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి వాస్కులర్ బైపాస్ సర్జెన్ డాక్టర్ సాయిరామ్ సుబ్రమణియన్ తెలిపారు. డాక్టర్ ఖైవానన్ కన్నియన్ తదితర వైద్యనిపుణుల బృందం శస్త్రచికిత్స చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తొలుత కాలిలో పెరిగిన ఎముకను తొలగించే శస్త్రచికిత్స ఆ తర్వాత ధమని వాపు సరిచేసే చికిత్స చేసిన మీదట రక్త ప్రసరణ మెరుగైనట్లు ఆయన చెప్పారు.

విజయ్ యాత్రకు అనుమతివ్వండి

- తిరువళ్లూరు ఎస్పీకి టీవీకే జిల్లా నేతల విజ్ఞప్తి



ఎస్పీ వివేకానంద శుక్లాకు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీవీకే నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచారయాత్రకు అనుమతులివ్వాలంటూ బుధవారం తిరువళ్లూరు జిల్లా ఎస్పీకి ఆ పార్టీ నేతలు వినతిపత్రం సమర్పించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని సినీ నటుడు విజయ్ చేపట్టిన ప్రచారయాత్ర ఈ నెల 27న తిరువళ్లూరుకు చేరుకోనుంది. ఈ నేపథ్యంలో తిరుత్తణి, తిరువళ్లూరు, గుమ్మిడి పూండి సహా పలు ప్రాంతాల్లో ఈ యాత్ర జరగనుంది. ప్రచార యాత్రకు అనుమతివ్వాలంటూ జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లాకు జిల్లా టీవీకే నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గుమ్మిడిపూండి విజయ్‌కుమార్, తిరుత్తణి డిల్లీ, తిరువళ్లూరు కుట్టి ప్రకాష్, మహిళా విభాగాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేపట్టనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ అరుణ్ తెలిపారు. ఎగ్మూర్‌లోని సిటీ పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను విన్నారు. ఈ సమస్యలపై విచారణ చేపట్టి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం నిర్వహించే ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

జెండా స్తంభాల తొలగింపు భేష్

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశంస

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జెండా స్తంభాల తొలగింపులో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మద్రాసు హైకోర్టు ప్రశంసించింది. రాష్ట్రవ్యాప్తంగా రద్దీ ప్రాంతాలు, జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కన, ప్రైవేటు స్థలాల్లో రాజకీయ పార్టీలు, మత, కుల సంఘాలు ఏర్పాటుచేసిన జెండా స్తంభాలు తొలగించాలని హైకోర్టు మదురై ధర్మాసనం జనవరిలో ఉత్తర్వులు జారీచేసిన విషం తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ ఇళందిరయన్ తిరిగి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తాము చేపట్టిన చర్యలపై చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల కలెక్టర్లు నేరుగా హాజరై నివేదికలను సమర్పించారు. జెండా స్తంభాల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులిచ్చేందుకు మండల, జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటుచేశామని, దీనికి సంబంధించి జీవో కూడా ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది రవీంద్రన్ వివరించారు. అంతేగాక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు నిర్వహించే సభలు, కార్యక్రమాలకు రోడ్డు మధ్యలో ఉన్న సెంటర్ మీడియాలో జెండా స్తంభాలు ఏర్పాటుచేయరాదని, మూడు రోజుల కంటే ఎక్కువగా స్తంభాలు ఉంచరాదని కూడా నిర్దేశించామని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చర్యల్ని న్యాయమూర్తి అభినందించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పాటించాలని స్పష్టం చేశారు. అలాగే, ఈ మార్గదర్శకాలు అమలుచేయని అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణ అక్టోబరు 15వ తేదీకి వాయిదావేశారు.

చర్చీల స్థల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోండి

- సీఎం స్టాలిన్‌కు ఈసీఐ బిషప్‌ల విజ్ఞప్తి



సీఎం స్టాలిన్‌కు వినతిపత్రం ఇస్తున్న బిషప్‌లు

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన చర్చీలను క్రమబద్ధీకరించి జీవో జారీచేయాలని ఈసీఐ బిషప్‌లు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో మంగళవారం ఈసీఐ చెన్నై బిషప్ కదిరొళి మాణిక్యం అధ్యక్షతన పది మందికి పైగా బిషప్‌లు సీఎం స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రభుత్వ భూముల్లో నిర్మించిన చర్చీలను క్రమబద్ధీకరిరచాలని వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా ఆదిద్రావిడ క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని వారు సీఎంను కోరారు.

తిరునల్వేలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడి హత్య

- బిహార్ కార్మికుడి అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి రైల్వేస్టేషన్‌లో మంగళవారం రాత్రి హఠాత్తుగా ఓ యువకుడు ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో ఓ ప్రయాణికుడు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు రైల్వేపోలీసులు తెలిపారు. తిరునల్వేలి జంక్షన్ రైల్వేస్టేషన్ 4వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌లో ప్రయాణికులు రైలు కోసం వేచివున్నారు. సుమారు రాత్రి 10.45 గంటల సమయంలో ఇనుపరాడ్డుతో కేకలేస్తూ వెళ్లిన ఓ యువకుడు దాడి చేయడంతో తూత్తుకుడి జిల్లా మనియాచ్చికి చెందిన పాండిదురై (28), కోవై జిల్లా పెరియనాయకిపాళయంకు చెందిన తంగప్పన్ (28), కేరళకు చెందిన ప్రసాద్ (28)లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ప్రయాణికులు రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు క్షతగాత్రులను తిరునల్వేలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున తంగప్పన్ మృతిచెందాడు. కేసు నమోదు చేసిన రైల్వేపోలీసులు రైల్వేస్టేషన్‌లోని సీసీ పుటేజీ పరిశీలించి దాడికి పాల్పడిన యువకుడు తచ్చనల్లూరు రైల్వే ఫ్లైఓవర్ కింద ఇనుపరాడ్డుతో సంచరిస్తున్నట్లు గుర్తించి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆ యువకుడు బిహార్‌కు చెందిన సూరజ్ (22) అని తెలిసింది. ఆ యువకుడు ప్రయాణికులపై ఎందుకు దాడిచేశాడనే దానిపై దర్యాప్తు జరుపుతున్న పోలీసులు తెలిపారు.

ఆర్‌సీఎం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆరోగ్య కార్యక్రమాలు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీ ఆర్‌సీఎం 25వ వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా వంద రోజులపాటు 'రూపాంతరన్ యాత్ర' పేరుతో 25 రకాల మెగా ఈవెంట్లను నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్ తిలోక్ చందన్ ఛబ్రా తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ తదితర రుగ్మతలకు సంబంధించిన చికిత్సా విధానాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. బిల్వారా, సూరత్, కొచ్చిన్, గౌహతి, పాట్నా, ఢిల్లీ వంటి నగరాల మీదుగా సుమారు 17 వేల కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నటులు అశుతోష్ రాణా, మనోజ్ జోషి, ఆశిష్ విద్యార్థి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఆడబిడ్డకు జన్మనిచ్చిన బాలిక

- యువకుడిపై పోక్సో కేసు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక ఆడబిడ్డకు జన్మనిచ్చిన వ్యవహారంలో యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. నీలగిరి జిల్లా కున్నూర్ ప్రాంతానికి చెందిన దంపతులకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. 8వ తరగతి ఫెయిల్ కావడంతో ఆమె చదువు మధ్యలోనే నిలిపివేసింది. దీంతో, ఆమెను వేరే ప్రాంతంలో ఉన్న ఆమె అమ్మమ్మ ఇంటికి పంపించారు. అక్కడ ఓ మిల్లులో పనిచేస్తున్న తిరుచ్చికి చెందిన 21 ఏళ్ల యువకుడితో బాలికకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరు తల్లిదండ్రులకు తెలియకుండా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కలిసి జీవిస్తున్నారు. ఈ క్రమంలో, తల్లిదండ్రులను చూసేందుకు కున్నూరు వచ్చిన బాలిక కడుపునొప్పితో బాధపడుతుండడంతో ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లగా, పరీక్షించిన వైద్యులు, బాలిక 8 నెలల గర్భంతో ఉందని, ఇవి ప్రసవ నొప్పులని తేల్చి చెప్పారు. ఈ లోగా ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ వ్యవహారంపై కున్నూర్ మహిళా పోలీసులు విచారణ చేపట్టి పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, ఈ కేసును తిరుప్పూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బాలిక గర్భానికి కారణమైన యువకుడు ప్రస్తుతం దుబాయ్‌లో ఉండడంతో, అతనిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

పరువు హత్య కేసులో యువతి తల్లి సహా నలుగురి అరెస్ట్



పట్టుబడిన నిందితులు

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురైలో ప్రేమవ్యవహారంలో యువకుడిని హత్యచేసిన కేసులో యువతి తల్లి సహా నలుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. మైలాడుదురై సమీపంలో ఆడియమంగళం గ్రామానికి చెందిన కుమార్-రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు వైరిముత్తు (28) అదేప్రాంతానికి చెందిన కుమార్ కుమార్తె మాళిని అనే యువతిని పదేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. వీరిద్దరూ ఒకే వర్గానికి చెందినవారైనప్పటికీ వేరే వర్గానికి చెందిన మాళిని తల్లి విజయ వీరికి అభ్యంతరం తెలపడంతో ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. దీంతో గత ఆదివారం పోలీసులు ఆ రెండు కుటుంబాలతో చర్చించి వైరముత్తు-మాళిని వివాహానికి ఎవరూ అడ్డుచెప్పరాదని తీర్మానించారు. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో మాళిని తల్లి విజయ ప్రోత్సాహంతో సోదరులు గుహన్ (24), అతని మిత్రుడు అన్బునిధి (19) మాళిని బాబాయి భాస్కర్ (42) వైరముత్తుపై దాడి చేసి హతమార్చారు. దీనితో ఆ ప్రాంతంలోని పలు దళిత సంఘాలు వైరముత్తును హత్యచేసినవారి కఠినంగా శిక్షంచాలని నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ క్రమంలో మాళిని తల్లి విజయ సహా హత్యకు పాల్పడిన గుహన్, అన్బునిధి, భాస్కర్లను పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

కత్తిపట్టుకుని పెళ్లి కుమారుడి నృత్యం

- వరుడు సహా స్నేహితుల అరెస్టు

అడయార్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగయూరులో జరిగిన వివాహ వేడుకలో పెళ్లి కుమారుడు కత్తి పట్టుకుని నృత్యం చేసిన వీడియో వైరల్ కావడంతో పులియంతోపు ఏసీపీ సారథ్యంలో పోలీసులు వరుడు సహా అతని స్నేహితులు ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొడుంగయూరు అన్నై అవెన్యూ రెండో వీధికి చెందిన సంజయ్ అలియాస్ సుకుమార్ (20) అనే యువకుడికి ఆదివారం వివాహం జరిగింది. శనివారం రాత్రి రిసెప్షన్ లో ఫొటోలకు ఫోజులివ్వడంతో పాటు పెద్ద కత్తి పట్టుకుని స్నేహితులు, బంధువులతో కలిసి నృత్యం చేశాడు. దీన్ని అతని స్నేహితులు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయగా, అది కాస్త వైరల్ అయింది. దీన్ని గమనించిన పులియంతోపు ఏసీపీ ముత్తుకుమార్ స్పందించి సంజయ్ నేపథ్యంపై ఆరా తీయగా, పోలీస్ రికార్డుల్లో ఏకంగా 13 కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంజయ్ వ్యాసార్పాడి గణేశపురం రైలు పట్టాల వద్ద ఉన్నట్టు సమాచారం రావడంతో అక్కడకు వెళ్ళిన పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించే క్రమంలో కిందపడటంతో కాలు విరిగింది. దీంతో సంజయ్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతడిచ్చిన సమాచారం మేరకు.. అతని స్నేహితులైన కోను (22), జైనుల్లాఖాన్ (28), విఘ్నేష్ (23)లను కూడా అరెస్టు చేశారు. వీరి నుంచి రెండున్నర కేజీల గంజాయి, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

ఏనుగు దాడిలో తోటమాలి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో తోటమాలి మృతిచెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. కడంబూరు కొండ ప్రాంతంలోని ఎలంజియం గ్రామానికి చెందిన ప్రభు (38) అదే ప్రాంతంలో వ్యవసాయ తోటలో పనిచేస్తున్నాడు. తోటలో అరటి చెట్లు వేసిన కారణంగా రాత్రి వేళల్లో ఏనుగులు, ఇతర జంతువులు ప్రవేశించకుండా ప్రకాష్ కాపాలా ఉంటున్నాడు. మంగళవారం కాపలా ఉన్న సమయంలో సమీపంలోని అడవి నుంచి ఏనుగు తోటలోకి ప్రవేశించింది. ఏనుగును గమనించి పక్క తోటల్లో పనిచేస్తున్న వారితో కలసి ప్రభు కూడా ఏనుగును తరిమేందుకు యత్నించాడు. ఏనుగు ఆగ్రహంతో తొండంతో ప్రభు చుట్టి విసిరేసి, కాళ్లతో తొక్కడంతో ఘటనా స్థలంలోనే అతను మృతిచెందాడు. ఈ ఘటనపై కడంబూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రేబిస్ వ్యాధికి గురైన వ్యక్తి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీధికుక్క కరవడంతో రేబిస్ వ్యాధికి గురై రక్తర వాంతులు చేసుకుంటూ ఓ వ్యక్తి మృతిచెందాడు. కృష్ణగిరి జిల్లా నాట్రాంపాళయం గ్రామానికి చెందిన మల్లప్ప (50) గత నెల 27వ తేది కూలి పనులకు వెళ్లిన సమయంలో, ఆ ప్రాంతంలో వీధి కుక్కలు పోట్లాడుకుంటుండడంతో మల్లప్ప, వాటిని తరిమేందుకు యత్నించాడు. ఓ శునకం మల్లప్ప మొఖంపై దాడిచేయడంతో గాయాలయ్యాయి. అతడిని తెంగణికోటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐదు రోజులు చికిత్స అనంతరం మల్లప్ప ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జి చేశారు. సోమవారం మల్లప్ప హఠాత్తుగా వాంతులు చేసుకోవడంతో అతడిని వెంటనే తెంగణికోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతని పరిస్థితి విషమించడంతో కృష్ణగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. ఈ విషయమై ఆసుపత్రి యాజమాన్యం విడుదల చేసిన ప్రకటనలో... వీధి కుక్క కరిచిన కారణంగా అతడికి రేబిస్ వ్యాధి సోకి మెదడుపై ప్రభావం చూపడంతో మృతిచెందాడని తెలిపింది. మల్లప్ప మృతదేహాన్ని బంధువులకు అప్పగించకుండా నేరుగా శ్మశానవాటికకు తీసుకెళ్లి దహనం చేశామని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

బాణసంచా కర్మాగారంలో అగ్నిప్రమాదం

- ఇద్దరి మృతి, 8 మందికి గాయాలు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా సాతూర్ సమీపంలోని బాణసంచా కర్మాగారంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, మరో 8 మందికి గాయాలయ్యాయి. శివకాశికి చెందిన మారిముత్తు వెంబకోట సమీపంలో బాణసంచా కర్మాగారం నిర్వహిస్తున్నాడు. కర్మాగారంలోని 30 గదుల్లో సుమారు వందమంది వరకు బాణసంచా తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో, బుధవారం కర్మాగారంలోని ఓ గదిలో రసాయనాలు కలుపుతుండగా హఠాత్తుగా మంటలు చెలరేగి భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి రెండు గదులు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో కండికాపురానికి చెందిన గౌరి (50) అనే మహిళ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరో 8 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అలంకుళం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక కాళిముత్తు (50) మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వన్నియార్లకు 15 శాతం రిజర్వేషన్లు కోరుతూ డిసెంబర్ 17న పీఎంకే జైలుభరో

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వన్నియార్లకు 15 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ డిసెంబర్ 17 పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)ఆధ్వర్యంలో జైలుభరో ఆందోళన జరుపనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో వన్నియార్లకు రిజర్వేషన్లు ప్రకటించడంలో డీఎంకే ప్రభుత్వం కపటనాటకాలాడుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వన్నియార్లకు 15 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని కోరుతూ డిసెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాల్లో జైల్‌భరో ఆందోళనలు జరుపుతామని అన్బుమణి పేర్కొన్నారు.

మంచి కథ కుదిరితే కమల్‌తో నటిస్తా

● రజనీకాంత్



కోవై ఎయిర్‌పోర్టులో విద్యార్థులతో రజనీకాంత్

మంచి కథ కుదిరితే అగ్రనటుడు కమల్ హాసన్‌తో కలిసి నటిస్తానని సూపర్‌స్టార్ రజనీకాంత్ వెల్లడించారు. 'జైలర్-2' సినిమా షూటింగ్ కోసం కేరళ రాష్ట్రంలోని పాలక్కాడుకు వెళ్ళేందుకు బుధవారం చెన్నై నుంచి కోయంబత్తూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'రెడ్ జెయింట్ మూవీస్, రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ కలిసి ఓ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఇంకా దర్శకుడు ఖరారు కాలేదు. మేమిద్దరం కలిసి నటించాలన్న ఆశ ఉంది. మంచి కథ, మంచి పాత్రలు సమకూరితే కలిసి నటిస్తాను. 'జైలర్-2' షూటింగ్ వచ్చే యేడాది జూన్ లేదా జూలైలో పూర్తికావొచ్చు. ఈ సినిమా షూటింగ్ ఇపుడు పాలక్కాడ్‌లో జరుగుతోంది. 6 రోజులు షూటింగులో పాల్గొనేందుకు వెళుతున్నాను' అని రజనీకాంత్ పేర్కొన్నారు. కాగా, హీరోల సభలకు వచ్చే వారంతా ఓట్లు వేస్తారా అని అడిగిన ప్రశ్నకు ఆయన నో కామెంట్స్ అంటూ సమాధానమిచ్చారు. ఇదిలావుంటే, యాత్రి సేవా దివస్‌ను పురస్కరించుకుని కోవై అవినాశిలింగం కాలేజీ విద్యార్థినులు నృత్యం చేస్తూ రజనీకాంత్‌కు స్వాగతం పలికారు. ఆ తర్వాత వారితో కలిసి సూపర్‌స్టార్ గ్రూపు ఫొటో దిగారు.

చిత్రజ్యోతి



'కిస్' మూవీ ప్రీరిలీజ్ రిలీజ్ దృశ్యం

కవిన్ తొలి సినిమాకు కొరియోగ్రఫీ చేశా

● 'కిస్' దర్శకుడు సతీష్

కవిన్ హీరోగా పరిచయమైన తొలి చిత్రానికి తాను కొరియోగ్రఫీ చేశానని, తాను దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రానికి కవిన్ హీరో కావడం యాదృచ్ఛికమని, ఇది ఎంతో సంతోషంగా, గర్వంగానూ ఉందని డెబ్యూ డైరెక్టర్ సతీష్ అన్నారు. కవిన్, ప్రీతి జంటగా సతీష్ తెరకెక్కించిన చిత్రం 'కిస్'. రోమియో పిక్చర్స్ పతాకంపై రాహుల్ నిర్మించారు. ఈ నెల 19 న విడుదలకానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ మంగళవారం రాత్రి నగరంలో జరిగింది. ఇందులో చిత్ర బృందం సభ్యులంతా పాల్గొన్నారు. ముందుగా దర్శకుడు సతీష్ మాట్లాడుతూ, 'ఈ టైటిల్ దర్శకుడు మిష్కిన్ నుంచి తీసుకున్నాం. కవిన్ తొలి చిత్రానికి నేను కొరియోగ్రాఫర్‌ను. దర్శకుడిగా నా తొలి చిత్రానికి కవిన్ హీరో. ఇది ఎంతో సంతోషంగా ఉంది. హీరోయిన్ ప్రీతి, నటుడు వీటీవీ గణేష్‌తో పాటు ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ ఎంతగానో సహకరించారన్నారు. హీరో కవిన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మూవీలో ఒక పాట పాడిన అనిరుథ్, ఒక పాట రాసిన దర్శకుడు విఘ్నేష్ శివన్‌లకు ధన్యవాదాలు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడొచ్చన్నారు. హీరోయిన్ ప్రీతి మాట్లాడుతూ, 'ఇది ఒక వినోదాత్మక చిత్రం. సినిమా మొత్తం నవ్వుతూనే ఉంటారని వెల్లడించారు. ఆ తర్వాత నటులు వీటీవీ గణేష్, మిర్చి విజయ్, సంగీత దర్శకుడు జెన్ మార్టిన్, నిర్మాత రాహుల్ తదితరులు ప్రసంగించారు.

కోలీవుడ్ హీరోయిన్‌గా స్టేజ్ ఆర్టిస్ట్



తృప్తి రవీంద్ర

స్టేజీ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందిన తృప్తి రవీంద్ర తమిళ వెండితెరకు హీరోయిన్‌గా పరిచయమయ్యారు. మహారాష్ట్రకు చెందిన ఈ భామ.. విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'శక్తి తిరుమగన్' చిత్రంలో నటించగా, ఈ నెల 19న తమిళం, తెలుగు భాషల్లో విడులకానుంది. ఈ సినిమా అనుభవాలను తృప్తి వివరిస్తూ, 'నేను నటనలో శిక్షణ పొందాను. స్టేజ్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నాను. ఇపుడు 'శక్తి తిరుమగన్'లో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అరుణ్ ప్రభు దర్శకుడు. మల్టీటాలెంటెడ్‌గా గుర్తింపు పొందిన విజయ్ ఆంటోనీతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉంది. ఈ మూవీ ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాను. తమిళ సంస్కృతీ సంప్రదాయాలను ఎంతగానో ఇష్టపడుతున్నాను. తమిళంను కూడా నేర్చుకుంటున్నాను. ప్రేక్షకుల మనసుల్లో గుర్తుండిపోయే పాత్రలను ఇచ్చే ప్రతిభావంతులైన దర్శకులతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాను' అని పేర్కొన్నారు.



శింబును పెళ్లి చేసుకుంటా : నటి చాందిని

● టి.రాజేందర్ భావోద్వేగం

హీరో శింబును వివాహం చేసుకుంటానని బుల్లితెర నటి చాందిని చేసిన వ్యాఖ్యలకు ఆయన తండ్రి, సినీ దర్శకనటుడు, నిర్మాత టి.రాజేందర్ (టీఆర్) ఒకింత భావోద్వేగానికిలోనై కంటతడిపెట్టారు. ఒక టీవీ షోకు టీఆర్ న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఇందులో పాల్గొన్న బుల్లితెర నటి చాందిని మాట్లాడుతూ 'నేను పెళ్ళంటూ చేసుకుంటే శింబును మాత్రమే చేసుకుంటాను' అని అన్నారు. ఈ మాట వినగానే టి.రాజేందర్ ఎమోషనల్ అయ్యారు. 'నేను కూడా మనిషే కదమ్మా. నాకూ హృదయం ఉంది. భార్యను ఇష్టపడటమే కాదు... పిల్లలను ఇష్టపడటం కూడా ప్రేమే. నీ మాటలు నాకు తప్పుగా అనిపించడం లేదు. అయినప్పటికీ నా మనసును క్షోభ పెడుతూనే ఉంది. నా బిడ్డను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే ఒక అమ్మాయిని ఆ దేవుడు ఇవ్వాలని వేడుకుంటున్నా. నేను నా కుమారుడి వద్దకు వెళ్ళి 'నీవు పెళ్ళి చేసుకో' అని అడగను'. ఆ దేవుడు వద్ద మాత్రమే మొరపెట్టుకుంటాను. మేము బలవంతం చేస్తే వాడు వద్దనడు. కానీ, నేనుగానీ, నా భార్యగానీ నా కుమారుడిని ఒత్తిడి చేయం' అంటూ వ్యాఖ్యానించారు. కాగా, తమిళ చిత్రపరిశ్రమలో మోస్ట్ బ్యాచిలర్స్ హీరోల్లో విశాల్, శింబు ఉండగా, విశాల్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్న విషయం తెల్సిందే.

అభ్యుదయ కవిత్వానికి తొలి వెలుగు ఆరుద్ర

● ఆచార్య మేడిపల్లి రవికుమార్



మేడిపల్లి రవికుమార్‌ను సత్కరిస్తున్న ఎలిజబెత్, ఎల్బీ శంకరరావు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ కవిత్వానికి తొలి వెలుగు ఆరుద్ర అని, సాహిత్యాన్ని, శాస్త్రాన్ని సమాజానికి ఎలా అన్వయించాలన్నది ఆరుద్ర తన రచనల ద్వారా సూచించారని ఎస్వీ యూనివర్శిటీ తెలుగుశాఖ విశ్రాంత అధ్యక్షులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మెరీనాలోని రాజధాని కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'అభ్యుదయ సాహిత్యంలో ఆరుద్ర' అనే అంశంపై ఆచార్య మేడిపల్లి ప్రసంగిస్తూ.. ఆరంభం నుంచి అవసానం వరకు ఆరుద్ర అభ్యుదయ కవియేనని, మార్క్సిస్ట్ కళ్లల్లోంచి సమాజాన్ని చూశారని తెలిపారు. ఆరుద్ర కవన నడకను శ్రీశ్రీ నుంచి, మార్క్సిజం చాగంటి సోమయాజులు నుంచి, ఆంగ్ల సాహిత్య అవగాహన రోణంకి అప్పలస్వామి నాయుడు నుంచి స్ఫూర్తి పొందారన్నారు. ఆరుద్ర రచనల్లో త్వమేవహం, సినీ వాలి రచనల గురించి ప్రస్తావించారు. శాస్త్రీయ సాంకేతికతను తెలుగు సాహిత్యానికి అన్వయించడంలో గొప్ప రచనలు చేశారని కొనియాడారు. రాజధాని కళాశాల పూర్వ విద్యార్థి కూడా అయిన తాను.. తను చదువుకున్న కళాశాలలో, తమ గురువు ఎల్బీ శంకరరావు సమక్షంలో ప్రసంగించడం సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆచార్య డాక్టర్ మురళి స్వాగతం పలుకగా, తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు విద్యావేత్తలు, రచయితలు, గురువులు, అధ్యాపకులు, పరిశోధకులు కూడా హాజరయ్యారు.

చెన్నై రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ'



పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాలు అందిస్తున్న డీఆర్ఎం శైలేంద్ర సింగ్

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం ప్రారంభమైంది. బుధవారం సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్ శైలేంద్ర బాబు జెండా ఊపి ప్రారంభించారు. రైల్వేస్టేషన్, పరిసర ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచేలా అక్టోబరు 7వ తేది వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్లు, రైళ్లు, డిపోలు, షెడ్స్, రైల్వే ఆస్పత్రులు, రైల్వే కాలనీలు, రైల్వే కార్యాలయాల్లో చెత్త చెదారం తొలగించనున్నారు. రైల్వే స్టేషన్లు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణానికి ప్రయాణికులు సహకరించాలని డీఆర్ఎం శైలేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా 'పరిశుభ్రత పాటిద్దాం' అనే నినాదంతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ మీద అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు సంతకాలు చేశారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించే ప్ల కార్డులతో రైల్వే స్టేషన్‌లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ ఉపకరణాలతో కూడిన కిట్లను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం తేజ్ ప్రతాప్ సింగ్, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

12యేళ్ల అనంతరం విరబూసిన కురింజి పుష్పం

● గూడలూరులో పర్యాటకుల సందడి



నీలం రంగు కురింజి పుష్పం

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకమలం అనే పువ్వు 12యేళ్లకు ఒకసారి మాత్రమే వికిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే.ఆ కోవకు చెందిన నీలంరంగు కురింజి పుష్పం పుష్కర కాలం తరువాత ప్రస్తుతం నీలగిరి, కొడైకెనాల్, పశ్చిమ కనుమల్లో విరబూసింది. 'స్ట్రోఫిలాంథాస్'అనే శాస్త్రీయనామం కలిగిన ఈ అరుదైన పుష్పం గూడలూరు మండలంలోని ఓవేలి అటవీప్రాంతంలో వికసించిందని అటవీశాఖ అధికారులు రాష్ట్రప్రభుత్వ ఉద్యానవన శాఖకు తెలియజేశారు. ఈ నీలంరంగు కురింజి పుష్పం సోయగాన్ని తిలకించేందుకు పర్యాటకులను అనుమతించాలని రాష్ట్రపర్యాటక శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ ఉత్తర్వులతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో వెళ్లి నీలంరంగు కురింజి పుష్పాన్ని చూసి ఆనందంతో సెల్ఫీలు తీసుకుంటున్నారు.

ప్రధానికి రైతుల వినూత్న జన్మదిన శుభాకాంక్షలు



పొలం మధ్యలో 'మోదీ' పేరుతో శుభాకాంక్షలు చెబుతున్న రైతులు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం తన 75వ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ప్రధానికి కాంచీపురం జిల్లా అవళూరు గ్రామానికి చెందిన రైతులు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట మధ్యలో 'మోదీ' అనే పేరు ఏర్పాటుచేసి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు ప్రోత్సాహక నిధి,వరి క్వింటాలకు రూ.2,500 అందించినందుకు కృతజ్ఞతగా ప్రధానికి ఈ తరహాలో శుభాకాంక్షలు తెలిపినట్లు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

కొడికరైలో విదేశీ విహంగాల సందడి



కొడికరై సమీపంలోని సముద్రంలో ఫ్లెమింగోలు

పెరంబూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగపట్టిణం జిల్లా కొడికరై పక్షుల శరణాలయంలో సీజన్ ప్రారంభమయ్యే నెల రోజులు ముందుగానే విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. సాధారణంగా విదేశీ విహంగాలు అక్టోబరులో ఈ ప్రాంతాలకు వచ్చి పునరుత్పత్తి చేసుకుని ఏప్రిల్‌లో తిరిగి స్వదేశాలకు వెళుతుంటాయి. కానీ, ప్రస్తుతం జలాశయాలు నీటిలో కళకళలాడుతుండడంతో, విదేశీ విహంగాలు నెల రోజుల ముందుగానే కొడికరై చేరుకుంటున్నాయి. సైబీరియాకు చెందిన నాలుగడుగుల ఫ్లెమింగోలు, శ్రీలంక నుంచి పెలికాన్స్ సహా పలు దేశాలకు చెందిన పక్షులు ఈ ప్రాంతానికి చేరుకున్నాయి. ఈ క్రమంలో, అటవీ శాఖలో కొత్తగా ఉద్యోగంలో చేరిన వివిధ జిల్లాలకు చెందిన 68 మందితో కూడిన బృందం శరణాలయానికి వచ్చిన విదేశీ పక్షులను పరిశోధిస్తున్నారు.

వైభవంగా విశ్వకర్మ యజ్ఞమహోత్సవం



యజ్ఞమహోత్సవంలో చెన్నపురి తెలుగు విశ్వకర్మ సమాజం నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): 'చెన్నపురి తెలుగు విశ్వకర్మ సమాజం' ఆధ్వర్యంలో బుధవారం విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం వైభవంగా నిర్వహించారు. కొరట్టూరు కెనాల్‌రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో ఉదయం 8.30 గంటలకు విద్యాశాఖ విశ్రాంత అధికారి వి.లక్ష్మీపతి వేదిక ప్రాంగణంలో విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరుకు చెందిన కొండూరి సాయికుమార్ శర్మ లోకకల్యాణార్థం విరాట్ విశ్వకర్మ యజ్ఞాన్ని నిర్వహించచారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్.కృతిక కర్ణాటక సంగీత విభావరితో శ్రోతలను అలరించారు. కార్యక్రమంలో భాగంగా వీరమల్లు వీరభద్రరావు, గుంటుపల్లి సత్యనారాయణ (చందు), చిప్పాడ కృష్ణకుమార్, మాలుగు ప్రసాద్‌రావు, కె.యువరాజ్ ఆచారిలను పంచబ్రహ్మలుగా ప్రకటించి పురస్కారాలు ప్రదానం చేసి, సత్కరించారు. అనంతరం నిర్వహించిన మ్యూజికల్ చైర్‌లో చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని బందరు బాబు వెంకటరత్నం నిర్వహించగా, సభాధ్యక్షుడిగా సమాజం అధ్యక్షులు కణితి రాంబాబు వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శి వై.వసుమతి, నూతక్కి జగదీష్, వి.వి.దుర్గాప్రసాద్, అత్తలూరి పరమేశ్వరరావు, పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.



సేలం కలెక్టరేట్ వద్ద బుధవారం కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

ఆదికుంభేశ్వర ఆలయ ఏనుగుకు రూ.2లక్షలతో వెండి కాలి పట్టీలు



కాలికి కొత్త పట్టీలతో ముచ్చటగొల్పుతున్న ఆలయ ఏనుగు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలోని సుప్రసిద్ధ ఆదికుంభేశ్వరాలయ ఏనుగుకు ఢిల్లీకి చెందిన మహిళా పారిశ్రామిక వేత్త రూ.2 లక్షల విలువైన వెండి కాలి పట్టీలను కానుకగా సమర్పించారు. మహామఖం ఉత్సవాల సంబంధిత ఆలయాల్లో మొదటిదైన ఆదికుంభేశ్వరాలయ కుంభాభిషేక వేడుకలు డిసెంబర్ 1న జరుగనున్నాయి. ప్రస్తుతం ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆలయంలోని 'మంగళం' అనే ఆడ ఏనుగుకు ఢిల్లీకి చెందిన మహిళా పారిశ్రామికవేత్త రూ.2లక్షలతో 1.5 కేజీల బరువైన వెండి కాలి పట్టీలను కానుకగా సమర్పించారు. వాటిని గర్భాలయంలో మూలవిరాట్టు ముందుంచి పూజలు చేసిన అనంతరం శివాచార్యులు వాటిని ఏనుగుకు ధరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మురుగన్, మావటి అశోక్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూటమిలో చివరి క్షణంలో మార్పులు జరగొచ్చు

● బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్



తిరువాన్మియూరు బీచ్ వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న నయినార్ నాగేంద్రన్ తదితరులు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ - అన్నాడీఎంకే కూటమిలో మార్పులు జరగవచ్చని, చివరి నిముషంలో మరికొన్ని పార్టీలు కూటమిలోకి వచ్చే అవకాశముందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం తిరువాన్మియూరు బీచ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) భేటీ కావటం మంచిదేనని, రాష్ట్ర రాజకీయాలపై సమీక్షించి, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అమలు చేయాల్సిన వ్యూహాల గురించి ఇరువురూ చర్చించుకోవడం శుభపరిణామంగా భావించాలన్నారు. జయలలిత మృతి తర్వాత రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని కాపాడింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఈపీఎస్ ఏ ఉద్దేశంతో అన్నారో తనకు తెలియదని, దీనిపై ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్ కూటమి నుండి వైదొలగాక తనను విమర్శించడం గమనార్హమన్నారు. శ్రీవిల్లిపుత్తూరులో నాగేంద్రన్ తనకు మంచి మిత్రుడని చెప్పిన దినకరన్ ప్రస్తుతం తనను తీవ్రంగా ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. తిరువాన్మియూరు బీచ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం పూర్తయ్యాక ఆయన పట్టినంబాక్కం బీచ్‌లో పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.



టి.నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాగేంద్రన్

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు...

ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, పసికందులకు ఉంగరాల పంపిణీ, పేదలకు వస్త్రదానం వంటి పలు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగ్రేందన్ టి.నగర్‌లోని పార్టీ కార్యాలయం కమలాలయం వద్ద నిరుపేదలకు వస్త్రాలను దానం చేశారు. ఆ తర్వాత పట్టినంబాక్కం బీచ్, తిరువాన్మియూరు బీచ్‌ల్లో స్వచ్ఛభారత్ పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. పట్టినంబాక్కంలోని తులుకానతమ్మన్ ఆలయాన్ని దర్శించి ప్రధాని మోదీపేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వినోజ్, ఉపాధ్యక్షుడు కరునాగరాజన్, సంజీవి తదితరులు పాల్గొన్నారు.మధ్యాహ్నం పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం చేశారు.పార్టీ సెంట్రల్ చెన్నై ఈస్ట్ శాఖ ఆధ్వర్యంలో రక్తదానం, ఉచిత వైద్యశిబిరం, సహాయాల పంపిణీ కూడా నిర్వహించారు. ఇదే విధంగా హైకోర్టు ప్రాంగణంలో పార్టీ న్యాయవాదుల విభాగం ఆధ్వర్యంలో న్యాయవాదులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత రాయపురం ఆర్ఎస్ఆర్ఎం ఆసుపత్రిలో బుధవారం జన్మించిన 17 మంది పసికందులకు బంగారు ఉంగరాలను కానుకగా అందించారు.



రాయపురం ఆర్ఎస్ఆర్ఎం ఆసుపత్రిలో ఓ పసికందుకు బంగారు ఉంగరం తొడుగుతున్న నయినార్ నాగేంద్రన్



రక్తదానం, వైద్య శిబిరాలకు విశేష స్పందన

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఐక్యూఏసీ, వైఆర్‌సీ, వైఐ, ఎన్ఎస్ఎస్ విభాగాల సహకారంతో కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను ఎస్‌కేపీసీ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు సాగిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, నేత్ర, దంత, సాధారణ వైద్య పరీక్షలను వైద్యుల బృందం నిర్వహించింది. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.పీబీ వనిత, తెలుగు అధ్యాపకురాలు డా.పీఎన్.మైథిలి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.పి.భరణికుమారిసహా సుమారు 60 మందికి పైగా విద్యార్థినులు రక్తదానం చేశారు. వీరికి ప్రశంసాపత్రాలు, వైద్యులు, సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు.


వాసంశెట్టి శుభాష్


రవళి, ఆర్కే రోజా


జ్యోతి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మంత్రి వాసంశెట్టి శుభాష్, మాజీ మంత్రి ఆర్కే రోజా, సినీ నటులు రవళి, జ్యోతి ఉన్నారు.

త్వరలో 'వాయుపుత్ర'

● దర్శకుడు చందూ మొండేటి వెల్లడి

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): సితార బ్యానర్‌లో త్వరలో 'వాయుపుత్ర' అనే కొత్త సినిమా షూటింగ్ మొదలవుతుందని దర్శకుడు చందూ మొండేటి వెల్లడించారు. కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమాకు విడుదల ముందు, తర్వాత తిరుమలకు వస్తుంటామన్నారు. 'కార్తికేయ-2' ఓపెనింగ్ కూడా ఇక్కడే జరిగిందన్నారు. అలాగే 'తండేల్' విజయం తర్వాత కూడా చిత్ర బృందంతో వచ్చి స్వామిని దర్శించుకున్నట్టు చెప్పారు.



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తుతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.87 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,607

తలనీలాలు సమర్పించినవారు: 23,856



ఆండవన్ ఆశ్రమాధిపతికి టీటీడీ పెద్ద మర్యాద



తిరుమల, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రామాధిపతి వరాహమహాదేశికన్ టీటీడీ పెద్ద మర్యాదతో బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద టీటీడీ అధికారులు, అర్చక బృందం పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపాన్ని వారికి సమర్పించారు. అక్కడ నుంచి మంగళవాయిద్యాల నడుమ మహాద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లి మూలవిరాట్టును దర్శించుకున్నారు.

ఆ మృతుల వెనుక ఆర్థిక వివాదాలు?

● సెల్‌ఫోన్ డాటా విశ్లేషణ, పోస్టుమార్టం నివేదికలే కీలకం


ఆనవాళ్లు సేకరిస్తున్న సీఐ సుదర్శన ప్రసాద్

పాకాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాకాలవారిపల్లె సమీపంలోని బయటపడిన మృతదేహాల కేసులో ఆర్థికాంశం కీలకంగా మారింది. ఆదివారం రెండు మృతదేహాలు, తర్వాత గోతుల్లో మరో ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా కనిపించిన విషయం తెలిసిందే. మృతులది తమిళనాడుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. తమిళనాడు పోలీసులతో వెంకటేష్ అనే వ్యక్తి వచ్చి మృతురాలు జయమాలను తన భార్యగా, దర్శిని, వర్షిణిలను కుమార్తెలుగా గుర్తించారు. మృతుడు క్లైసెల్వన్ దగ్గర బంధువని పోలీసులకు చెప్పాడు. కాగా కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య ఆర్థిక విషయంలో గొడవలున్నట్లు తెలిసింది. కువైట్ నుంచి తిరిగి వచ్చిన వెంకటేష్ బంధువు క్లైసెల్వన్‌పై చీటింగ్ కేసు పెట్టినట్లు సమాచారం. ఈక్రమంలో జూలైలో భార్యాపిల్లలు కనిపించడంలేదని తిట్టచ్చేరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాడు. మృతదేహాల వివరాలు తెలిసినా జయమాల కుటుంబసభ్యులెవరూ సంఘటనా స్థలానికి రాలేదు. క్లైసెల్వన్‌కు చెందిన వారు కూడా రాలేదు. జయమాల భర్త, మామ, బావలు మాత్రమే తమిళనాడు పోలీసులతో వచ్చారు. మృతదేహాల వద్ద రెండు సెల్‌ఫోన్లు దొరికాయి. చిన్నపాప మృతదేహం తలపై గాయాలున్నాయి. పోస్టుమార్టం రిపోర్టు, సెల్‌ఫోన్ల విశ్లేషణ వివరాలు వస్తే హత్యా లేదా ఆత్మహత్య అనేది తెలిసే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

ఎడప్పాడి ముసుగేసుకుని రావడానికి కారణం ఏమిటి?

● ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్

అడయార్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటనకు వెళ్ళిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి ముసుగేసుకుని కారులో వెళ్ళడానికి కారణం ఏమిటని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ ప్రశ్నించారు. ఆయన బుధవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, పార్టీ, అధికారం, జయాపజయాలు, ఆత్మాభిమానం అంటూ ఎడప్పాడి పదేపదే ఊకదంపుడు ప్రచారం చేస్తుంటారని, పైగా ఆయన చేపట్టే రాష్ట్ర పర్యటనకు కూడా వాతావరణం అనుకూలంగా లేదని వాయిదా వేశారన్నారు. కానీ ఆకస్మికంగా ఢిల్లీకి వెళ్ళి ఉపరాష్ట్రపతిని కలిసి, ఆ తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారన్నారు. అయితే, అమిత్ షాతో సమావేశానంతరం కారులో తిరిగి వెళుతూ ఎడప్పాడి ముఖానికి ముసుగు ధరించి వెళ్ళడం వెనుక రహస్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎడప్పాడి వెళ్ళడం వెనుక ఉన్న రహస్యాన్ని వెల్లడించాలని లేనిపక్షంలో ఇకనుంచి ఎడప్పాడిని 'ముగమూడియార్ ఎడప్పాడి' అని పిలుస్తారని దినకరన్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


పూజా కార్యక్రమంలో విశ్వకర్మ సంఘ నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. పళ్లిపట్టులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాయిశ్రీ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ టీఎస్ఎం. గురుమూర్తి పాల్గొన్నారు. విశ్వకర్మ కులాభివృద్ధి కోసం సంఘ సభ్యులంతా ఒకటై పాటుపడాలని సంఘ నిర్వాహకులు పార్థిబన్ ఆచార్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె.భాస్కర్ ఆచారి, కేజీ.ఎలుమలై ఆచారి, రవిఆచారి, కన్నన్ ఆచారి, కేశవన్ ఆచారి, పీవీ.సతీష్, కరుణ ఆచారి, షణ్ముగం ఆచారి, శ్రీనివాస ఆచారి, శేఖర్‌ఆచారి, మణికందన్ ఆచారి, మోహన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఏసీ వినియోగంలో చెన్నై ప్రథమం

● పర్యావరణశాఖ సర్వేలో వెల్లడి

ప్యారీస్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఏసీ వినియోగంలో దేశంలోని మెట్రోనగరాల్లో చెన్నై అగ్రస్థానంలో ఉందని కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తా, అహ్మదాబాద్, పూణె, జైపూర్, చెన్నై నగరాల్లో పర్యావరణం సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంతర్జాతీయ సంఘం సుమారు 3,100 మంది వద్ద సర్వే జరిపింది. ఇందులో చెన్నై నగరం ఏసీ వినియోగంలో ప్రథమస్థానంలో ఉన్నట్లు స్పష్టమైంది. నగరంలో దాదాపు 23శాతానికి పైగా ఇళ్లలో రెండు కంటే అదనంగా ఏసీలు ఏర్పాటు చేసుకుని, వేసవి సీజన్‌లో ఒకరోజుకు సరాసరి 4 గంటలు ఏసీలో గడపుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా నగరంలో 73శాతం మంది ఏసీ యంత్రాలకు అవసరమైన గ్యాస్ నింపడానికే ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిసింది. అదేసమయంలో ఏసీ యంత్రాలను చక్కగా మరమ్మతులు చేసే సాంకేతిక నిపుణుల కొరత కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు సర్వేలో తేలింది.

కాణిపాక లడ్డు రూ.6.25 లక్షలు



లడ్డూను అందుకుంటున్న సుభాష్ గుప్తా

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గుర్తుగా తయారు చేసిన 21 కేజీల మహాలడ్డూకు మంగళవారం అర్ధరాత్రి వేలం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సుభాష్‌గుప్తా రూ.6,25,000కు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో పెంచల కిషోర్, మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మదినిండా.. మారుతి జెండా

● ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు ముస్తాబవుతున్న గూడూరు


రూపుదిద్దుకుంటున్న ఆంజనేయస్వామి జెండా


గూడూరులో ఆంజనేయస్వామి జెండా గ్రామోత్సవం (ఫైల్ ఫొటో)

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దసరా అనగానే మైసూరు తరువాత గుర్తుకు వచ్చేది గూడూరు. నవరాత్రులకు ఒక రోజు ముందుగానే ఇక్కడ జరిగే జెండా ఉత్సవాలు మరీ ప్రత్యేకం. విజయదశమి ముందు వచ్చే అమావాస్య నాడు జరిగే ఈ వేడుకను పట్టణ ప్రజలు వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి కూడా ఈనెల 21వ తేదీ రాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి.

ఇదీ జెండా వేడుక నేపథ్యం

గూడూరు ఏర్పడిన తొలినాళ్లలో అరిష్టాలు ప్రబలి వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు భావించారు. ఆంజనేయ స్వామిని పూజిస్తే కష్టాలు కడతేరుతాయని విశ్వసించారు. ఈక్రమంలోనే 77 ఏళ్ల క్రితం తొలిసారిగా బొడ్డుచౌక ప్రాంతంలోని శక్తిరాయి వద్ద ఆంజనేయ స్వామి జెండాను ప్రతిష్ఠించినట్లు చెబుతారు. జెండాకు ఆరు గజాల తెల్లని వస్త్రం వాడారు. దీనిపై సంజీవని పర్వతం తీసుకుని భూమిపై దిగుతున్న భంగిమలో ఆంజనీపుత్రుడి చిత్రాన్ని వేశారు. ఈజెండాను ఎనిమిది అడుగుల వెదురుకర్రకు అమర్చి విజయదశమి ముందు వచ్చిన అమావాస్యనాడు సాయంసంధ్య వేళ గ్రామోత్సవం నిర్వహించారు. ఈపూజల ఫలితంగా పట్టణంలో వ్యాధులు తగ్గుముఖం పట్టాయని జనం నమ్మి ఏటా అదేరోజుల ఆంజనేయస్వామి జెండా పండుగను వైభవంగా నిర్వహించడం అనవాయితీగా మారింది.

వీధివీధినా పోటాపోటీగా..


ప్రస్తుతం పట్టణ వీధులలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌దీపాలంకరణ


కోనేటిమిట్టలో విద్యుద్దీపాలంకరణ (ఫైల్ ఫొటో)

పట్టణం విస్తరించింది. అదేతరహాలో పలు ప్రాంతాల్లో ఆంజనేయస్వామి జెండాలను ప్రతిష్ఠించడం మొదలైంది. ఇప్పుడు 40కి పైగా జెండాలేర్పడిన ఇక్కడ వీధుల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలానుగుణంగా ఈ పతాకాన్ని రంగురంగులతో ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు. సంజీవని పర్వతాన్ని మోసుకువస్తున్న ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని ట్రాక్టరుపై ఘనంగా ఊరేగిస్తారు. మేళతాళాలు,సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పోటాపోటీగా ఈ వేడుక జరుగుతోంది. ఊరేగింపు ముందు తెనాలిబ్యాండు, బేతాళ, కాంతార నృత్యాలు, జింగిరి మేళం, తప్పెట్లు, తాళాలు, కోలాటాలు, కేరళ బ్యాండు, తీన్‌మార్, బొట్టబొమ్మల అభినయం, పార్వతీమహిషాసురుల యుద్ధనాట్యాలు, ఆకర్షణగా నిలుస్తాయి.జెండా ఉత్సవాలు ముగిసిన మర్నాడు (ఈనెల 22న) నుంచి శరన్నవరాత్రుల నిర్వహణకు శ్రీకారం చుడతారు.ఈక్రమంలోనే జెండా పండగకు పట్టణ ప్రజలు సిద్ధమవుతున్నారు.

మధురాంతకం వద్ద రెండువేల ఎకరాల్లో గ్లోబల్ సిటీ

● మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు టెండర్ల ఆహ్వానం



చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మధురాంతకం వద్ద 2 వేల ఎకరాల విస్తీర్ణంలో గ్లోబల్ సిటీ నిర్మాణానికి రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ (టిడ్కో) ప్రాథమిక స్థాయి పనులను ప్రారంభించింది. ఆ మేరకు ఈ గ్లోబల్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకోసం టెండర్లను ఆహ్వానించింది. రాజధాని నగరం చెన్నైకి చేరువగా 2 వేల ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో సకల సదుపాయాలతో కూడిన గ్లోబల్‌సిటీని నిర్మించనున్నట్లు మార్చిలో శాసనసభలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రకటించిన విషయం తెలిసిందే. విశాలమైన సిక్స్‌వే, ఫోర్‌వే రహదారులు, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థల భవనాలు, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ రెసిడెన్షియల్ భవనసముదాయాలు, మాల్స్, సినిమా థియేటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, విశ్రాంతి గృహాలతో సింగపూర్, స్విట్జర్లాండ్‌ను తలపించేలా సర్వాంగ సుందరంగా ఈ గ్లోబల్ సిటీ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ గ్లోబల్ సిటీ పూర్తిగా కాలుష్య రహితంగా ఉంటుందన్నారు. ఈ గ్లోబల్ సిటీ కోసం కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు, రాణిపేట జిల్లాల్లో ఐదు ప్రాంతాలను అధికారులు పరిశీలించి ఆ మేరకు టిడ్కోకు ప్రతిపాదనలు పంపారు. టిడ్కో సంస్థ అధికారులు ఆ ప్రతిపాదనలను పరిశీలించిన మీదట చెంగల్పట్టు జిల్లా మధురాంతకం ప్రాంతం గ్లోబల్‌సిటీ నిర్మాణానికి అన్ని విధాలుగా అనువైనట్టు గుర్తించారు. మధురాంతకం వద్దే 2 వేల ఎకరాల విస్తీర్ణంలో కొత్త గ్లోబల్ సిటీ నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గ్లోబల్‌సిటీ నిర్మాణానికి తగిన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడానికిగాను టిడ్కో సంస్థ ప్రస్తుతం టెండర్లు ఆహ్వానించినట్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు.

ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయండి

● లండన్‌లో మంత్రి లోకేశ్‌కు పిచ్చాటూరు యువత విజ్ఞప్తి


మంత్రి లోకేశ్‌తో సోమపల్లి నందు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు తరలిరావాలని మంత్రి లోకేశ్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేందుకు లండన్‌లోని పాల్‌మాల్ కన్వెన్షన్ వేదికగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - యూకే బిజినెస్ ఫోరం రోడ్ షో నిర్వహించాయి. టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షల్ అస్నానీ అనుసంధానకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో పిచ్చాటూరు సింగిల్‌విండో ఛైర్మన్ జయచంద్రనాయుడు తనయుడు సోమపల్లి నందు మాట్లాడారు. బంగళా గ్రామం నుంచి ఎన్‌హెచ్ 716బి చిత్తూరు- తచ్చూరు రోడ్డు అనుబంధంగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ పార్కు అభివృద్ధితో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్లు నందు తెలిపారు. అనంతరం ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలను వివరించానని పేర్కొన్నారు. ఈ రోడ్ షోలో యూకే డిప్యూటీ హైకమిషనర్ సుజిత్ ఘోష్, ఐసీఐసీఐ బ్యాంక్ యూకే సీఈవో రాఘవ్ సింఘాల్, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ అభిషిక్త్ కిశోర్, గ్లోబల్ ఫండ్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్ కంపెనీల ప్రతినిధులు, గంధమనేని కామేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్లకు 22 నెలల జైలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడిన నలుగురు స్మగ్లర్లకు 22 నెలల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బుధవారం తీర్పు చెప్పారు. రాయచోటి డివిజన్ పరిధిలోని ఫారెస్టు లైజన్ అధికారి అనిల్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు.. కేవీ పల్లె మండలం నూతన కాలువకు చెందిన ఎస్. రమణయ్య, ఎర్రిమల్లయ్య, శివ మల్లయ్య, ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయలపెంటకు చెందిన బి.మల్లికార్జున 2012లో సానిపాయి రేంజ్, దిన్నెల బీట్‌లో దాదాపు 31 ఎర్రచందనం దుంగలు అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారు. దీనిపై అందిన సమాచారంతో అప్పటి ఫారెస్టు బీట్ అధికారి సత్యనారాయణ, సిబ్బంది తనిఖీలు చేశారు. ఆ నలుగురు స్మగ్లర్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. దీనిపై రాయచోటిలోని రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు విచారించిన తర్వాత ఈ కేసును తిరుపతికి బదిలీ చేశారు. ఏపీపీ శాంతి వాదనలు వినిపించగా, ఫారెస్టు లైజన్ అధికారి అనిల్‌కుమార్ సాక్ష్యాధారాలను కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత నలుగురు స్మగ్లర్లకు 22 నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీకాంత్ తీర్పు చెప్పారు.

తల్లి పేరుతో రాఘవ లారెన్స్ అన్నదానం

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తన కన్నతల్లి కన్మణి పేరుతో ప్రముఖ సినీ దర్శక నిర్మాత, హీరో రాఘవ లారెన్స్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాను చేస్తున్న సమాజ సేవలో భాగంగా 'కన్మణి అన్నదాన విరుందు' (కన్మణి అన్నదాన విందుభోజనం)ను ఆయన నగరంలో ప్రారంభించారు. ఇక్కడ సంచారజాతులకు చెందిన చిన్నారులకు, వృద్ధులకు విందు భోజనం వడ్డించనున్నారు. ఈ విషయాన్ని రాఘవ లారెన్స్ తన ఇన్‌స్టా ఖాతాలో వెల్లడించారు. 'సాధారణంగా ధనవంతులు మాత్రమే ఆరగించే వివిధ రకాలైన మాంసాహార వంటకాలను ఆ సంచారజాతికి చెందిన చిన్నారులు, వృద్ధులు ఆరగిస్తున్నపుడు వారి ఆనందాన్ని చూసి నా హృదయం ఉప్పొంగిపోయింది. బుధవారం నుంచి ప్రారంభించిన ఈ కొత్త ప్రయాణానికి మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలు కావాలని కోరుతున్నాను. ఎంతోమంది చిన్నారుల ఆకలి తీర్చే ఈ కార్యక్రమం నిరంతరాయంగా సాగేలా దీవించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. కాగా, రాఘవ లారెన్స్ ఇటీవల తాను ఎంతో ఇష్టపడి నిర్మించుకున్న తన తొలి ఇంటిని పాఠశాల భవనంగా మార్చిన విషయం తెల్సిందే.

చిన్నారికి అన్నం తినిపిస్తున్న లారెన్స్




హతవిధీ! రాందాస్ కారుపై పీఎంకే జెండా తొలగింపు

● పార్టీ వ్యవస్థాపకుడి స్థితికి ఖిన్నులైన కార్యకర్తలు


రాందాస్ కారుకు పెట్టిన వన్నియార్ సంఘం జెండా

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వన్నియార్ల సామాజికవర్గానికి దిక్సూచిలా నిలిచారాయన.. ఆ తరువాత 'పాట్టాలి మక్కల్ కట్చి' పేరుతో పార్టీని స్థాపించి అన్నీ తానై నడిపించి.. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ప్రభుత్వాలకు అండగా నిలిచారాయన.. ఆయనే జనం నాడి తెలిసిన డాక్టర్ రాందాస్. కానీ పార్టీ పగ్గాల వారసత్వ రేసులో కుమారుడ్ని తట్టుకోలేక పక్కకు తొలగిపోయారీ దృఢమైన నేత. తను స్థాపించిన పార్టీ పతాకాన్ని సైతం తన వాహనంపై పెట్టుకోలేని స్థితిలో మిగిలిపోయారాయన. తన వాహనంపై వన్నియార్ల సంఘం జెండాతో ఓ కార్యక్రమానికి వచ్చిన రాందాస్‌ను చూసి పలువురు కార్యకర్తలు ఖిన్నులయ్యారు. వన్నియార్ల రిజర్వేషన్ కోసం జరిగిన ఉద్యమంలో అసువులు బాసినవారికి నివాళులర్పించేందుకు బుధవారం ఉదయం కారులో వచ్చిన రాందాస్‌ను చూసిన నేతలు ముందుగా దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీ జెండాకు బదులు వన్నియార్ల సంఘం పతకాన్ని కారుకు పెట్టుకుని చూసి కార్యకర్తలకు నోటిమాట రాలేదు. ప్రస్తుతం పార్టీలో ఆధిపత్యం కోసం రాందాస్, ఆయన తనయుడు అన్బుమణి పోటీపడుతున్న విషయం తెలిసిందే. తన నిర్ణయాలను ఎదిరించిన కుమారుడు అన్బుమణిని కొద్ది రోజుల క్రితం పార్టీ సభ్యత్వం నుండి తొలగించారు. అదే సమయంలో పీఎంకే అధ్యక్షుడిగా అన్బుమణిని గుర్తిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసినట్లు ఆయన అనుచరులు ప్రకటించారు. దీనితో తీవ్ర మనస్థాపానికి గురైన రాందాస్ తైలాపురం గార్డెన్ నివాసంలో తనను కలుసుకునేందుకు వచ్చిన పార్టీ ప్రముఖుల వద్ద బాధపడినట్లు తెలిసింది. తాను స్థాపించిన పార్టీని తన నుంచి దూరం చేశారంటూ ఆయన భావోద్వేగానికి గురైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉదయం తన కారుకు వన్నియార్ల సంఘం పతాకం తగిలించుకు రావడం చర్చనీయాంశమైంది.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు


అన్నదాన కార్యక్రమంలో బీజేపీ నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): భారత్ ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నార్త్ యూనియన్ బీజేపీ అధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో పళ్లిపట్టులోని బీచక్ ఆస్పత్రి ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి జ్యోతి, మునియప్పన్, హరిప్రసాద్, రోహిత్, హేమలత, రామకృష్ణన్, ఢిల్లీబాబు, గోవిందస్వామి సహా పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.